ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 9 డిసెంబరు 2025



ప్రజాపాలనకు రెండేళ్లు

- సంక్షేమ పథకాలతో పలువురికి లబ్ధి
- రూ. 3 వేల కోట్లతో అభివృద్ధి పనులు
- మొదలైన పెద్దపల్లి ఆర్టీసీ బస్సు డిపో పనులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నేటితో రెండేళ్లు పూర్తి కావస్తున్నది. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుండగా, వాటి ద్వారా జిల్లాకు చెందిన ప్రజలు కూడా లబ్ధి పొందుతున్నారు. అభివృద్ధి పనులు కూడా ముందుకు సాగుతున్నాయి. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా తీరుస్తున్నారు. సంక్షేమ పథకాలు కొన్ని అమలు కాకపోవడంతో ఆయా వర్గాలకు చెందిన ప్రజలు కాస్త అసంతృప్తికి గురవుతున్నారు. 2023 నవంబర్ చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుని అధికారంలోకి వచ్చింది. జిల్లాలో గల మంథని, పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు విజయం సాధించారు. మంథని నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్ర మల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రజాపాలనలో కీలకంగా వ్యవహరి స్తున్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఐటీ, పరిశ్రమల రంగంలో వేల కోట్ల రూపా యల పెట్టుబడులను తీసుక వస్తూ యువతకు ఉపాధి కల్పిస్తున్నారు. పెద్దపల్లి, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన చింతకుంట విజయ రమణా రావు, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి సన్నిహితులు కావ డంతో తమ నియోజవర్గాల అభివృద్ధికి కోట్ల రూపాయలు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తున్నారు. పెద్దపల్లి, మంథని ఆసుపత్రుల అప్‌గ్రేడేషన్ తో పాటు రోడ్ల నిర్మాణానికి, పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు, రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలపడం, మంథనిలో రింగ్‌రోడ్డు, బైపాస్ రోడ్డు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణంతో పాటు సుమారు 3 వేల కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించగా పనులు కొనసాగుతున్నాయి.

● అమల్లో పలు సంక్షేమ పథకాలు..

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నది. జిల్లాలో కొత్తగా 12,168 రేషన్ కార్డులను జారీ చేశారు. ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతున్నది. రేషన్ వినియోగదారులకు దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యం ఇస్తామన్న హామీ మేరకు ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. దీంతో రేషన్ వినియోగదారులకు సన్న బియ్యం కొనుగోలు భారం తప్పింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత బస్సు రవాణా సౌకర్యం వల్ల విద్యాభ్యాసం కోసం పట్టణాలకు వెళ్లే విద్యార్థినులకు, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేసే మహిళలకు, చిరు వ్యాపారం చేసే మహిళలకు రవాణా ఖర్చుల భారం తగ్గింది. ఈ పథకం ద్వారా జిల్లాలోని 1,17,856 కుటుంబాలకు 500 రూపాయలకే సబ్సిడీ వంట గ్యాస్‌ను ఇస్తున్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం సౌకర్యం కల్పించడం వల్ల అనేక మంది లబ్ధి పొందుతున్నారు. అంతేగాకుండా ఆ పథకం ద్వారా ఆయా వ్యాధులకు వైద్యం అందని వారికి ఎమ్మెల్యేలు ఎల్‌ఓసీలు ఇప్పిస్తూ తద్వారా వైద్యాన్ని అందిస్తున్నారు. గృహలక్ష్మి పథకం 200 యూనిట్ల వరకు 1,31,187 కుటుంబాలకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్నారు. రుణ మాఫీ పథకం కింద 2 లక్షల రూపాయల వరకు రైతులకు రుణ మాఫీ చేశారు. రైతు భరోసా పథకం కింద 1,21,698 మంది రైతులకు గడిచిన వానాకాలం సీజన్‌లో 88 కోట్ల 86 కోట్ల రూపాయల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. గత ఏడాది వానాకాలం సీజన్‌లో సన్న రకం ధాన్యం పండించిన రైతులకు క్వింటాలుకు 500 రూపాయల చొప్పున 101 కోట్ల రూపాయల వరకు బోనస్ చెల్లించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున మంజూరు చేయగా, జిల్లాలో 6 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలు ఆరంభమయ్యాయి. చేయూత పథకం ద్వారా కొత్తగా పింఛన్లు మంజూరు చేయడంతో పాటు, పింఛన్లు పెంచకపోవడం, విద్యార్థినులకు స్కూటీలు, మహిళలకు నెలకు 2500 రూపా యలు, కల్యాణలక్ష్మి పథకం ద్వారా తులం బంగారం ఇవ్వక పోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి నెలకొన్నది.

● రూ. 3 వేల కోట్లతో అభివృద్ధి పనులు..

రెండేళ్లలో జిల్లాలో 3 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరుగు తున్నాయి. మంథని నియోజకవర్గంలో చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు 531 కోట్లు మంజూరు

(మిగతా 8వ పేజీలో)



నేటితో ముగియనున్న తొలివిడత ప్రచారం

- మద్యం దుకాణాలు 48 గంటలు మూసివేత
- బ్యాలెట్ పేపర్ పై తొలిసారి నోటా
- డిస్ట్రిబ్యూషన్, కలెక్షన్ సెంటర్ల ఏర్పాట్లు పూర్తి
- 11న తొలి విడత పోలింగ్
- పోలింగ్ ఏర్పాట్లకు విడుదల కాని నిధులు
- పంచాయతీ కార్యదర్శుల పై ఆర్థిక భారం
- పోలింగ్ సామగ్రి పంపిణీకి సిద్ధం



పంపిణీకి సిద్ధంగా ఉన్న పోలింగ్ సామగ్రి

మంథని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల తొలి విడత పోరు తుది దశకు చేరుకుంది. తొలి విడతలో జిల్లాలోని మంథని, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లోని 99 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 4 గ్రామ పంచాయతీలో సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 48 గంటల ముందే ఎన్నిక ప్రచారాన్ని ముగించాల్సి ఉండగా మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులు ఎన్నికల ప్రచారానికి తెరదించాల్సి ఉంది. మరో వైపు మంగళవారం సాయంత్రం నుంచే ఎన్నికలు జరిగే మండలాల్లో మద్యం షాపులు మూసివేయనున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఉండేందుకు మద్యం షాపులను మూసి వేస్తున్నారు. వారం రోజులుగా ఎన్నికల ప్రచారం చేసిన పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నట్లు సమాచారం. ఓటర్ల మచ్చిక చేసుకోవటానికి ఎన్నికల ముందు రోజు రాత్రి, తెల్లవారుజామున మద్యం, నగదు పంపిణీ చేయటానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. మరో వైపు అధికార యంత్రాంగం పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లల్లో నిమగ్నమై ఉంది. పోలింగ్ నిర్వహించే పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇచ్చారు. మండలాన్ని జోన్లు, రూట్లుగా విభజించారు. పోలింగ్ సామగ్రిని మండల కేంద్రంలో ప్రత్యేక గదుల్లో భద్రపరిచారు. బందోబస్తు కోసం పోలీసులను పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయించారు. మండల కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్, రికవరీ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈనెల 10న ఉదయం నుంచి పోలింగ్ సామగ్రి, ఉద్యోగులను గ్రామ పంచాయతీలకు తరలించనున్నారు.

● బ్యాలెట్ పేపర్‌పై తొలిసారి నోటాకు చోటు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈసీ తొలిసారిగా బ్యాలెట్ పేపర్ నోటాకు చోటు కల్పించారు. ఎన్నికల్లో పోటీ చేసేందకు నిలబడిన అభ్యర్థులు వారికి నచ్చకపోతే తిరస్కరణ ఓటు వేసే అధికారాన్ని ఈసీ కల్పించింది. ఇప్పటి వరకు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎం మిషన్లలో మాత్రమే పొందు పరచగా తొలి సారి స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ పై నోటాను చేర్చారు.

● మండలంలో పోలింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధం..

మంథని మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో ఈనెల 11 పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయటానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాటు చేసుకుంది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణ కోసం 324 మంది పోలింగ్ ఆఫీసర్లు, 250 మంది అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు ట్రైనింగ్ ఇచ్చారు. మండలాన్ని 4 జోన్లుగా, 11 రూట్లుగా విభజించారు. 34 మందిని గ్రామ పంచాయతీ రిటర్నింగ్ ఆఫీసర్లుగా నియమించారు. స్థానిక ప్రభుత జూనియర్ కళాశాల భవనంలో పోలింగ్ సామగ్రిని భద్రపరిచారు. ఇదే కళాశాల గ్రౌండ్‌లో డిస్ట్రిబ్యూషన్, రికవరీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈనెల 10న ఇక్కడి నుంచి 19 బస్సుల్లో పోలింగ్ సామగ్రిని, 600 మంది పోలింగ్ సిబ్బంది, 100 మంది పోలీసు సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

● కార్యదర్శుల పై ఆర్థిక భారం..

పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు, ఏర్పాట్ల కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో కార్యదర్శుల పై ఆర్థిక భారం పడుతుంది. సర్పంచ్‌తోపాటు వార్డు స్థానాలకు వేర్వురుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటి వద్ద ఓటర్ల కోసం వేసే టెంట్లు, కుర్చీలు, బెంచీలు, మంచినీటి సదుపాయాల కోసం నిధులు మంజూరు కాకపోవడంతో కార్యదర్శులే ప్రస్తుతం ఖర్చులు భరించే పరిస్థితి ఉంది. ప్రతీ కార్యదర్శికి రూ. 5 వేల పైనే ఆర్థికంగా భారం పడే అవకాశం ఉంది. కలెక్టర్ స్పందించి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా

● సిద్దిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి తాటికొండ లక్ష్మీశంకర్



ప్రచారం చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి తాటికొండ లక్ష్మీశంకర్

కమాన్‌పూర్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): సిద్దిపల్లి గ్రామాభివృద్ధికి తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని సిద్దిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి తాటికొండ లక్ష్మీశంకర్ అన్నారు. సోమవారం వారు ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తన భర్త తాటికొండ శంకర్ సర్పంచ్‌గా గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేశారని, సిద్దిపల్లిలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఉన్న కల్వర్టుతో రైతులు ఇబ్బందులు పడుతుంటే దానిని మరమ్మతులు చేయించారని పేర్కొన్నారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు తదితర అభివృద్ధి పనులను ముందుండి చేయించానని, తన గురించి ప్రజలకు, రైతులకు తెలుసునని, మరోసారి అవకాశం కల్పించి భారీ మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. గ్రామాభివృద్ధి మరింత జరగాలంటే తమకు పట్టం కట్టాలని తాటికొండ లక్ష్మీశంకర్‌లు పేర్కొన్నారు. కాగా ఆయా కాలనీలకు ప్రచారానికి వెళ్లిన తాటికొండ లక్ష్మీశంకర్ దంపతులకు పలువురు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి మద్దతు ప్రకటించారు. వారు గెలుపు ధీమాతో మరింత ముందుకు ప్రచారంలో తమదైన శైలితో సాగుతున్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

పెద్దపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులను రిటర్నింగ్ అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికల పరిశీల కులు అనుగు నరసింహారెడ్డితో కలిసి ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో మంగళవారం రెండో విడత ఎన్ని కల సిబ్బందికి, 11న మూడో విడత సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటిం గ్ సౌకర్యం కల్పించాలని, రిటర్నింగ్ అధికారులు ఎంపీడీఓ కార్యాల యం వద్ద అందుబాటులో ఉండాలని తెలిపారు. మొదటి విడత పోస్టల్ బ్యాలెట్ సుమారు 68 వరకు వచ్చాయని తెలిపారు. డిస్ట్రిబ్యూ షన్ కేంద్రాలకు పోలింగ్ బృందాలు చేరుకున్నా యో లేదో రిటర్నింగ్ అధికారి ఫాలో అప్ చేయాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందు పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలిం గ్‌కు ముందురోజు ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్దే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసి కౌంటింగ్‌కు చర్యలు చేపట్టాలని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభం అవుతుందని, కౌంటింగ్ జాగ్రత్తగా చేయాలన్నారు.

పంచాయతీ ఎన్నికలు జరిగిన రోజే ఉప సర్పంచ్ ప్రక్రియ ముగిసే విధంగా చర్యలు తీసుకోవాలని, 50 శాతం కంటే ఎక్కువ వార్డు సభ్యులు అందుబాటులో ఉండేలా వారికి సమాచారం అందించాలని అన్నారు. పోలింగ్, కౌంటింగ్, ఉప సర్పంచ్ ఎంపిక పూర్తయి, ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ సామగ్రి డిపాజిట్ చేసే వరకు రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పూర్తి బాధ్యతగా ఉండాలని కలెక్టర్ అన్నారు. జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి శారద, పాల్గొన్నారు.



పాలకుర్తిలో రిక్రియేషన్ క్లబ్ కేంద్రంలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పాలకుర్తి, అంతర్గాంలో పర్యటన

పాలకుర్తి,అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి మండలంలోని రిక్రియేషన్ క్లబ్, అంతర్గాం మండలంలోని ఎంపిడీవో కార్యాలయాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 9న పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఫారం 14, ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ ప్రతులు తీసుకురావాలని, రెండో విడత పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ పంపిణీ నిబంధన ప్రకారం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపిడివోలు పొల్సాని శశికళ, వేముల సుమలత, ఎంపివోలు పూర్ణచందర్ రావు, కర్ణాకర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో గ్రీన్ ఎనర్జీ పరిశ్రమ 6

రామగుండం కార్పొరేషన్‌లో విజిలెన్స్ తనిఖీలు

కోల్‌సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల బృందం కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, ఎస్టాబ్లిష్‌మెంట్, అకౌం ట్స్ విభాగాల్లో రికార్డులు తనిఖీ చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో రూ.50లక్షల లోపు పనులపై ఆరా తీశారు. టౌన్ ప్లానింగ్‌లో అనుమతుల మంజూరు, దరఖాస్తుల పెండింగ్ తదితర విషయాలపై ఆరా తీశారు. ఆర్థిక విభాగంలో వాహనాలు, డీజిల్, పెట్రోల్ వాడకం, కొనుగోళ్లపై రికార్డులు పరిశీలించారు. కార్మికులకు రెయిన్ కోట్లు, యూనిఫాంలు, ఇతర సామగ్రి విషయంపై కార్మికులతో మాట్లాడారు. కొందరు కార్మికులు తమకు సామగ్రి రాలేదని విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో ఇప్పటికే తనిఖీలు జరిపారు. వివిధ విభాగాల పని తీరుపై లోటుపాట్లపై ప్రభుత్వానికి నివేదించే అవ కాశాలున్నాయి.



కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజా సేవ, గ్రామాభివృద్ధే లక్ష్యం

● పుట్నూర్ సర్పంచ్ అభ్యర్థి కల్లెపు బాలాజీరావు



ప్రచారం నిర్వహిస్తున్న బాలాజీ రావు (ఇన్‌సెట్‌లో బాలాజీరావు)

పాలకుర్తి, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధి, ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా ముందుకు వస్తున్నానని సర్పంచ్ అభ్యర్థి కల్లెపు బాలాజీ రావు అన్నారు. మండలంలోని పుట్నూర్‌లో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా కల్లెపు బాలాజీ రావు గెలుపు బాటలో కొనసాగుతున్నట్లు ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. న్యాయవాదిగా ప్రాక్టీస్ వదులుకొని సొంత గ్రామంపై ఉన్న మమకారంతో పాటు గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వస్తున్న తనను ఉంగరం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామంలోని వాడవాడల విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గతంలో గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, మార్కెట్ యార్డు నిర్మాణానికి తన వంతు సహకారం అందించాచని, చట్టం, న్యాయం, ధర్మం తెలిసిన వ్యక్తిగా గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో పాటు పలువురు గ్రామస్థులు సర్పంచ్‌గా పోటీ చేయాలని కోరడంతో ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచానని బాలాజీ రావు అన్నారు. బాలాజీరావు ప్రచారానికి చిన్న పెద్ద తారతమ్యం లేకుండా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

వార్డులో అందరూ బీసీలే... ఎస్సీకి రిజర్వ్

● వార్డుకు దాఖలుకాని నామినేషన్

సుల్తానాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆ వార్డులో అందరూ బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లే కానీ వార్డును ఎస్సీలకు రిజర్వు చేశారు. వార్డులో పోటీ చేయడానికి ఎస్సీలు ఎవరూ లేకపోవడంతో నామినేషన్లు దాఖలు కాలేదు. సుల్తానాబాద్ మండలం బొంతకుంటపల్లి గ్రామ పంచాయతీలో ఎనిమిది వార్డులున్నాయి. ఆ గ్రామం మూడో వార్డులో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఆ వార్డులో ఓటర్లందరూ బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే. కానీ వార్డును అధికారులు ఎస్సీలకు రిజర్వు చేశారు. దీంతో నామినేషన్లు రాలేదు. ఈ విషయమై ఎంపీడీవో దివ్యదర్శన్ రావు వివరణ ఇస్తూ మూడో వార్డు ఎస్సీలకు రిజర్వు అయిందని, గ్రామంలోని ఏ వార్డుకు సంబంధించిన ఎస్సీ ఓటరైనా మూడో వార్డు నుంచి పోటీ చేయవచ్చని, వారిని బలపరిచే వ్యక్తి మూడో వార్డుకు సంబంధించిన వారై ఉండాలన్నారు. బలపరచడానికి ఎవరూ లేకపోయేసరికి వార్డులో ఎన్నిక నిలిచిపోయిందన్నారు.

పెద్దపల్లి మార్కెట్‌లో పత్తికి రూ. 7,338 పలికిన ధర

పెద్దపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటాలు పత్తికి అత్యధికంగా రూ.7,338 ధర పలికింది. సోమవారం మార్కెట్‌కు 157 మంది రైతులు 513 సంచుల్లో 548.91 క్వింటాళ్ల పత్తి తీసుకువచ్చారు. క్వింటాలు అత్యధికంగా రూ.7,338, అత్యల్పంగా రూ.6,701, మోడల్ ధర 7,116 పలికింది.

వైభవంగా చతుర్థి వేడుకలు

మంథని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాగణపతి ఆలయంలో చతుర్థి వేడుకలను భక్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పల్లి రాముశర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజించారు. భక్తులు రాత్రి వరకు పూజలు చేశారు. ఆలయ ఆవరణ సందడిగా మారింది.



పూజలు చేస్తున్న భక్తులు

రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడికి ఎన్నికల విధులు

పెద్దపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం పదవీ విరమణ పొందిన ఒక ప్రధానోపాధ్యాయుడికి ఎన్నికల విధులు కల్పించిన ఉదంతం జిల్లాలో చోటుచేసుకున్నది. గోదావరిఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ఏడాది నవంబర్‌లో పదవీ విరమణ పొందిన చెరుకూరి ఇజ్రాయెల్‌కు ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా విధులకు హాజరు కావాలని లేఖ నంబర్ 0027/అంతర్గాం/2025 ద్వారా ఈ నెల 7వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అవాక్కయిన సదరు రిటైర్డ్ హెచ్‌ఎం పదవీ విరమణ పొందిన తనకు ఎన్నికలు విధులకు హాజరు కావాలని చెప్పడమేమిటని ప్రశ్నించారు. అయితే సదరు బాధితు డికి ఇదొక్కటే గాకుండా జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి పాఠశాలకు సంబంధించి రిపోర్టులు కావాలంటూ తరచూ ఫోన్లు వస్తుంటాయని ఆయన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

గొడవల్లో యువత తలదూర్చవద్దు

డీసీపీ రాంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాంరెడ్డి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంలో చదువుకున్న యువత గొడవలకు వెళ్లితే పోలీసు కేసులవుతాయని, దీని వల్ల భవిష్యత్‌లో ఉద్యోగాలు పొందే క్రమంలో ఇబ్బందులు పడుతారని డీసీపీ రాంరెడ్డి తెలిపారు. సోమవారం పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థులు యువత గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటున్నదని, అవసరం మేరకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రశాంతంగా ప్రచారం నిర్వహించుకోవాలని, ఎలాంటి గొడవలు జరిగినా చట్టం తనపని తాను చేసుకుపోతుందన్నారు. యువత ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలో తొమ్మిది గ్రామాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని, ఎలాంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వెంకటేష్, ఏఎస్ఐ నీలిమ, హెడ్‌కానిస్టేబుల్ ఆనంద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవాల కోసం గ్రామాల్లో జోరుగా మంతనాలు



ఎలిగేడు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా పోటీ చేసిన అభ్యర్థులతో ఉపసంహరణ చేయించి, ఏకగ్రీవం చేసుకునేందుకు పలు పార్టీల నాయకులు జోరుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎలిగేడు మండలంలో 12 గ్రామపంచాయతీల్లో 114 వార్డులు ఉండగా, 18570 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో సర్పంచ్ స్థానాలకు 47 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, 269 మంది వార్డు స్థానాలకు బరిలో నిలిచారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణ గడువు ఉండటంతో పలువురిని ఉపసంహరించేందుకు నాయకులు ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నారు. ఉపసంహరణ చేయించేందుకు బేరసారాలు చేస్తుండటంతో పోటీ నుంచి తప్పుకునేందుకు పెద్దమొత్తంలో డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం సాగుతున్నది. ఇప్పటికే 20 మందికిపైగా వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా సర్పంచ్ అభ్యర్థులు డబ్బులే కాకుండా భవిష్యత్‌లో ఇతర అవకాశాలు కల్పిస్తామంటూ హామీలతో వారిని లోబర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏదీ ఏమైనా మంగళవారం మూడు గంటల వరకు పోటీలో ఎవరు ఉంటారో తేలనున్నది.

గుండెపోటుతో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మృతి


దేవేందర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎర్రోజు దేవేందర్(53) సోమవారం మధ్యాహ్నం గుండె పోటుతో మృతిచెందారు. దేవేందర్ సోమవారం మధ్యాహ్నం 12గంటల వరకు కరీంనగర్‌లోని గాంధీ చౌరస్తాలో ట్రాఫిక్‌విధులు నిర్వహించారు. విధులు ముగించుకొని ఇంటికిచేరుకున్న వెంటనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 1992లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరిన దేవేందర్, ఆ తర్వాత సివిల్ పోలీసు కానిస్టేబుల్‌గా కన్వర్షన్ పొంది, ప్రస్తుతం హెడ్‌కానిస్టేబుల్‌గా కరీంనగర్ ట్రాఫిక్‌స్టేషన్‌లో సేవలు అందిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హెడ్ కానిస్టేబుల్ దేవేందర్ మృతిపై సానుభూతిని తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ, సీఐలు, ఎస్సైలు పోలీసు ఉన్నతాధికారులు దేవేందర్ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

అనారోగ్య సమస్యలతో వృద్ధురాలి ఆత్మహత్య


జీల మల్లవ్వ(ఫైల్)

గన్నేరువరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండల కేంద్రానికిచెందిన జీల మల్లవ్వ(85) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ సోమవారం గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన జీల మల్లవ్వ కొద్దిరోజులుగా అనారోగ్యసమస్యలతో బాధపడుతోంది. ఆవేదనకు గురయ్యేది. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డిమందు తాగింది. వ్యవసాయ పనులకు వెళ్లిన కొడుకు ఇంటికి వచ్చేసరికి అపస్మారకస్థితిలో ఉండడాన్ని చూసి అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. అప్పటికే వృద్ధురాలు మృతిచెందింది. కొడుకు జీల ఎల్లయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వృద్ధురాలికి భర్త, కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వీణవంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన బేతోజు అంజనేయులు(27) మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నవంబరు 30న అంజనేయులు మద్యం తాగి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లి గడ్డి మందు తాగాడు. తిరిగి వచ్చి తాను గడ్డి మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే 108లో కరీంనగర్ ఆస్పత్రికి, పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. అంజేయులు తల్లి విజయ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

చలి మంట కాగుతూ నిప్పంటుకొని వృద్ధురాలు మృతి

మల్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి గ్రామంలో సోమవారం చలిమంట కాగుతూ తొంట మల్లవ్వ(85) అనే వృద్ధురాలు మృతిచెందింది. మల్లవ్వ సోమవారం ఉదయం స్నానం చేయడానికి ఇంటివద్ద పొయ్యిమీద నీల్లు వేడి చేసుకుంటూ అక్కడే చలిమంట కాగుతోంది. ప్రమాదవశాత్తు చీరకు మంటలు అంటుకొని మల్లవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స కోసం మల్లవ్వను జగిత్యాలలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

దాడికి పాల్పడిన మహిళపై కేసు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలంలోకి అక్రమంగా ప్రవేశించడంతో పాటు దాడిచేసిన సంఘటనలో వీర్నపల్లి మండలకేంద్రానికి చెందిన మహిళ మునిగే భాగ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లక్ష్మణ్ సోమవారం తెలిపారు. గ్రామంలోని యాస యాకుబ్‌కుచెందిన పొలంలోకి భాగ్య ప్రవేశించిందని పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నించిన యాకుబ్‌ను అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడి చేసిందని చెప్పారు. బాధితుడు యాకుబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

మానకొండూర్‌లో 180 మంది బైండోవర్

మానకొండూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాత నేరస్తులు, గత ఎన్నికలలో గొడవలకు పాల్పడ్డ 180 మందిని బైండోవర్ చేసినట్లు సీఐ సంజీవ్ తెలిపారు. బైండోవర్ చేసిన ఆరునెలలలోపు మళ్లీ గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జేబులు గుల్ల





- వేములవాడలో జోరుగా మూడు బిళ్లల ఆట
- భక్తుల రద్దీ ప్రాంతాలే అడ్డాలు
- పట్టించుకోని అధికారులు

వేములవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం పరిసరప్రాంతాల్లో మూడు బిళ్లల ఆట జోరుగా సాగుతోంది. రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని సంతోషంగా తిరిగి వెళ్లాల్సిన కొందరు భక్తులు జేబులు ఖాళీ చేసుకుని వెళ్తున్నారు. వేములవాడకు వచ్చే భక్తుల వద్ద మూడు బిళ్లల ఆటతో దొరికినకాడికి దండుకుంటున్నారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు పట్టణానికి రావడం నిర్వాహకులకు వరంగా మారింది. అమాయక భక్తులకు గాలం వేసి మోసానికి పాల్పడుతున్నారు. పట్టణంలో భక్తులు రద్దీగా ఉండే ప్రాంతాలను అడ్డాలుగా మలుచుకుని దందా సాగిస్తున్నారు. జాతర గ్రౌండ్ ఏరియాలో సినిమా థియేటర్ సమీపంలో, గోశాల కట్ట వద్ద, రాజన్న ఆలయ సమీపంలో మూడు ప్రాంతాల్లో భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో వారి ఇష్టారాజ్యంగా మారింది.

అమాయకపు భక్తులకు గాలం

వేములవాడ పట్టణంలో రద్దీ ప్రాంతాలను గుర్తించి మూడు బిళ్లల ఆటను ఆడేందుకు ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకుంటారు. ఒక్కో చోట ముగ్గురు నుంచి నలుగురు వరకు తమ వ్యక్తులను ఆట ఆడేందుకు ముందుగానే సామాన్య భక్తుల మాదిరి ఆటవద్ద నిలుచుంటారు. భక్తుల దృష్టిని తమవైపు మళ్లించే విధంగా చేస్తారు. రూ. 100 నుంచి ఆట ప్రారంభం అవుతుంది. రూ. 100 పెడితే గెలిస్తే రూ. 200 ఇస్తారు. రూ. 500లకు రూ. 1000 ఇస్తామని నమ్మించి భక్తులను మోసానికి గురిచేస్తారు. మూడు బిళ్లల్లో ఒక బిల్లకు కింది వైపు కలరు వుంటుంది. కలర్ ఉన్న బిళ్లను గుర్తించి ఎంత డబ్బులు పెడితే పెట్టిన వాటికి డబుల్ డబ్బులు ఇస్తామని మభ్యపెడతారు. మూడు బిళ్లలపై భక్తులు, ప్రజలు డబ్బులు పెడితే ఒక బిళ్లపై పెట్టిన వారికి మాత్రమే డబ్బులు వస్తాయి. మిగతా రెండు బిళ్లలపై పెట్టిన డబ్బులు మాత్రం నిర్వాహకులు తీసుకుంటారు. ఇలాంటి మోసం పట్టణంలో కొంత కాలంగా నడుస్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం దృష్టి సారించి ప్రజలు మోసానికి గురికాకుండా చూడాలని కోరుతున్నారు.


గోశాల సమీపంలో కట్టకింద మూడుబిళ్లలాట

నగదు, మద్యం పట్టివేత


పట్టుబడిన నగదును చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన తనిఖీలో పోలీసులు సోమవారం నగదు, మద్యాన్ని పట్టుకున్నారు. సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. మాడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో భాగంగా నగునూర్ నుంచి జూబ్లీనగర్‌వైపు వాహనాల తనిఖీ చేపట్టారు. కొత్తపల్లిమండలం రేకుర్తికి చెందిన వేముల శ్రీకాంత్ వద్ద లక్షరూపాయలను గుర్తించారు. నగదుకు సంబంధించి ఆధారాలు చూపించకపోవడంతో ఎన్నికలరిటర్నింగ్ అధికారి, తహసీల్దార్‌కు స్వాధీనం చేశారు.

● కరీంనగర్ రూరల్ మండలంలోని జూబ్లీనగర్, నగునూర్, దుర్శేడ్, చెర్లబూత్కూర్‌లో సోమవారం పెట్రోలింగ్ చేస్తుండగా మద్యం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ముద్దసాని సూర్యచందర్, మల్లేని సింహాద్రి, బుద్ధం రమేష్, జంగంపల్లి రవిని తనిఖీ చేయగా వారి వద్ద సుమారు 32 లీటర్ల విస్కీ, బీరు బాటిళ్లు లభించినట్లు పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రుద్రంగిలో మద్యం పట్టివేత

రుద్రంగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ మనోహర్ తెలిపారు. రుద్రంగి గ్రామానికిచెందన ఓవ్యక్తి బైక్‌పై రూ.4వేలవిలువగల మద్యం తరలిస్తుడటంతో రుద్రంగిలోని ప్రధాన రహదారిలో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధికారులు, పోలీసులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ కుమ్మరి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇష్టా రాజ్యంగా వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలకు హానీ కలిగించవద్దన్నారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని, పట్టుపడితే జరిమానాతో పాటు లైసన్స్ రద్దు చేసి జైలు శిక్ష పడేలా చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్ చేశారు. ట్రాఫిక్ సీఐలు అనీల్ కుమార్, రాజేశ్వర్‌రావు, సత్యనారాయణ తో 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

సైనికుడికి సన్మానం


సైనికుడిని సన్మానిస్తున్న యువకులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన యువకుడు బద్దిపడిగె వినయ్ అగ్నివీర్‌గా ఎంపికై మద్రాస్ రెజిమెంట్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకుని స్వగ్రామానికి చేరుకున్నారు. ఆయనను స్థానిక యువకులు, గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. యువకులు వినయ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

రూ.2కోట్లకు ఐపీ పెట్టిన వ్యాపారి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): సిరిసిల్ల పట్టణంలో ఓ వ్యాపారి తాజాగా రూ.2కోట్లకు ఐపీ పెట్టడంతో అప్పులు ఇచ్చిన వారితోపాటు సామగ్రి ఇచ్చిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని ప్రగతినగర్, శివనగర్ ప్రాంతాల్లో మూడుసంవత్సరాల క్రితం పట్టణానికి చెందిన వ్యాపారి రూ.2 కోట్లతో సూపర్ మార్కెట్‌తోపాటు రైస్ డిపోను ఏర్పాటుచేశారు. అయితే సూపర్ మార్కెట్‌తోపాటు రైస్‌డిపోలలో నష్టం వాటిల్లడంతో సదురు వ్యాపారి రెండు నెలల నుంచి మార్కెట్‌ను మూసివేశాడు. అప్పులు ఇచ్చిన వారితోపాటు సామగ్రి ఇచ్చిన వ్యాపారులు వారి కుటుంబీకుల వద్దకు వెళ్లగా పదిరోజుల్లో అప్పులు చెల్లించి తిరిగి సూపర్ మార్కెట్‌ను తెరుస్తామని నమ్మించినట్లు తెలిసింది. పది రోజుల గడవక ముందే సదురు వ్యాపారి వ్యాపారంలో నష్టపోయా అప్పులు చెల్లించేస్థితి లేదంటూ అప్పులు ఇచ్చిన వారితోపాటు వ్యాపారులకు సోమవారం ఐపీలు పంపించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండడం సంచలనం రేపుతుంది.

జీతాలు పెంచి డ్రైవర్లను ఆదుకోండి


కార్మికులతో మాట్లాడుతున్న కౌశిక్ హరి

పాలకుర్తి,అంతర్గాం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుందనపల్లి హెచ్‌పి ఇంధన డిపోలో ట్యాంకర్ డ్రైవర్,క్లీనర్స్ జీతాలు పెంచి వారిని ఆదుకోవాలని సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక్ హరి అన్నారు.గతంలో వారు తమ సమస్యలను పరిష్కరించాలని హరిని సంప్రదించడంతో ట్యాంకర్ యజమానులతో చర్చించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. లేనియెడల ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్లు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటూ వారి హక్కుల సాధనకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ చర్చల్లో మద్దికుంట శంకర్,నిమ్మరాజుల రవి,నెరవట్ల సతీష్, ఎండీ ఇన్నూస్‌తోపాటు పలువురు డ్రైవర్లు,క్లీనర్లు ఉన్నారు.

కిరాణా సామాను పట్టివేత

వేములవాడ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరంలో హరీష్ అనే వ్యక్తి ఓటర్లకు పంచడానికి సిద్ధంగా ఉంచిన కిరాణా సామాను ప్యాకెట్లను ఎఫ్ఎస్‌టీ అధికారి సురేష్ పట్టుకొని వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. 13ప్యాకెట్ల కిరాణ సామాను విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని తెలిపారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

వీణవంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇసుక లారీలతో తమకు ఇబ్బంది కలుగుతోందని వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామస్థులు సోమవారం వాటిని అడ్డుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం వందలాది లారీలు గ్రామం నుంచి వెళ్తున్నాయని, రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని మండిపడ్డారు. దుమ్ముధూళితో అవస్థలు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన ఉన్న నివాసాల్లోకి దుమ్ము చేరుతోందని, అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని, నీళ్లుచల్లించాలని డిమాండ్‌చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.


రెడ్డిపల్లిలో లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామశివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఎల్లయ్య తన బైక్‌పై దుమాల బైపాస్ నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. అదే సమయంలో అక్కపల్లి గ్రామానికి చెందిన మహేశ్ తన పికప్ వాహనంలో కూలీలను ఎక్కించుకుని దుమాల వైపునకు వెళ్తుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎల్లయ్యను సిరిసిల్లలోని ఆసుపత్రికి అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

జమ్మికుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాలనీకిచెందిన దామెరసుధాకర్ కుటుంబ సభ్యులు మూడురోజుల క్రితం తిరుపతికి వెళ్లారు. ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు యజమానికి సమాచారం అందించారు. సోమవారం ఉదయం ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు మూడు తులాల బంగారం, రూ.30వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

పండ్ల తోటల సాగుతో అధిక ఆదాయం


బొప్పాయి తోట


జామ కాయలను తెంపుతున్న రైతు తిరుపతిరెడ్డి

గొల్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామంలో ఎనిమిది ఎకరాల్లో పండ్లతోట సాగు చేస్తూ ఓ రైతు అధిక ఆదాయం పొందుతున్నాడు. తిరుపతిరెడ్డి అనే రైతు తనకున్న వ్యవసాయ భూమిలో జామ, బొప్పాయి, మామిడి, కర్బూజ వంటి పండ్ల తోటల పెంపకంతోపాటు పందిరి బీర, కాకర వంటి కూరగాయల సాగు చేస్తున్నాడు. దీంతో ఏటా రూ.8లక్షల మేర ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు. తిరుపతి రెడ్డి తన భార్య, తల్లి సహకారంతో పండ్ల తోటలను సాగు చేస్తున్నాడు. పండించిన పండ్ల తోటలవద్ద రోడ్ల పక్కనే విక్రయిస్తున్నాడు. సీజనల్ పండ్ల సాగుకు అధికప్రాధాన్యం ఇస్తున్నాడు. ప్రస్తుతం జామ, బొప్పాయి పండ్లను సాగు చేస్తున్నాడు. వేసవిలో కర్బూజను సాగు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పండ్ల వ్యాపారులు, ఇతర చిరు వ్యాపారులు వీరి దగ్గర కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్లో విక్రయిస్తుంటారు. తిరుపతిరెడ్డి ఆరు సంవత్సరాలుగా పండ్ల తోటలను సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు.

● **పండ్ల తోటల పెంపకం లాభదాయకం..**
- తిరుపతిరెడ్డి, రైతు, శ్రీరాములపల్లి



సంప్రదాయ పంటల సాగు కంటే పండ్ల తోటల పెంపకం వల్ల అధిక లాభాలు గడించవచ్చు. ఆరుసంవత్సరాలుగా జామ,బొప్పాయి, మామిడి, కర్బూజ వంటి పండ్ల తోటల సాగు చేస్తున్నా. నా తల్లి, భార్య సహకారం ఎంతో ఉంది. వినియోగదారులకు తక్కువ ధరకు నాణ్యమైన తాజా పండ్లను విక్రయిస్తుంటాం.

రాష్ట్రంలో రూ.3వేల కోట్ల పెట్టుబడి

● గ్లోబల్ సమ్మిట్లో ప్రభుత్వంతో ఎంవోయూ ● పెద్దపల్లి జిల్లాలో గ్రీన్ ఎనర్జీ పరిశ్రమ


ఒప్పందం కుదుర్చుకున్న పత్రాలతో సురభి గ్రూపు ప్రతినిధులు

పెద్దపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఎనర్జీ సెక్టార్‌లో పెట్టుబడి పెట్టేందుకు సురభి గ్రూప్స్ ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌లో సురభి గ్రూప్ ఎస్ఎల్ఆర్ పవర్ ఛైర్మన్ సురభి హరేందర్‌రావు రాష్ట్రంలో 3వేలకోట్ల పెట్టుబడితో పెద్దపల్లి జిల్లాలో పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వంతో ఎంఓయు కుదుర్చుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి మల్లు విక్రమార్కకు ఎంవోయు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సురభి గ్రూప్స్ గ్రీన్ ఎనర్జీ సెక్టార్లో భాగంగా పెద్దపల్లి జిల్లా సుగ్లాం పల్లిలో 3వేల కోట్ల రూపాయల పెట్టుబడితో సోలార్‌సెల్, ప్యానెల్ తయారీ పరిశ్రమను నెలకొల్పుతున్నారన్నారు. ఈ పరిశ్రమ నిర్మాణం వల్ల వెయ్యి మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభించనుందన్నారు. ఏడాది కాలంలో పరిశ్రమ నిర్మాణం పూర్తవుతుందని, గ్రీన్‌ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన సురభి గ్రూప్స్ ఛైర్మన్ హరిందర్‌రావును అభినందించారు.

రెండు ప్రచార ఆటోలు సీజ్

తంగళ్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ప్రచారం నిర్వహిస్తున్న తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ గ్రామ సర్పంచ్ అభ్యర్థి గడ్డం రచన మధుకర్‌కు చెందిన రెండు ప్రచార ఆటోలను తహశీల్దార్ జయంత్ కుమార్ సీజ్ చేశారు. సర్పంచ్ అభ్యర్థి గడ్డం రచన మధుకర్‌కు చెందిన రెండు ప్రచార ఆటోలు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్నాయని తహశీల్దార్‌కు సమాచారం అందింది. తనిఖీ చేసి ఎలాంటి అనుమతి లేదని గుర్తించి రెండు ప్రచార ఆటోలను సీజ్ చేసి కేసు నమోదు చేయించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రచారానికి మైకు, ఆటో పర్మిషన్ తహశీల్దార్ కార్యాలయంలో తీసుకోవాలని సూచించారు.

ఉమ్మెత్త కాయలు తిని ఇద్దరు చిన్నారులకు అస్వస్థత

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌లో ఉమ్మెత్త కాయలు తిని ఇద్దరు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. తల్లిదండ్రులు ఓరును శ్రీను, స్రవంతి వివరాల ప్రకారం.. వారి కుమారుడు అదిత్య, కూతురు మహా గత శనివారం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ఆవరణలోని ఉమ్మెత్త చెట్టు కాయల గింజలను తిన్నారు. కొద్దిసేపటికి పిల్లలు ఇద్దరూ కడుపు నొప్పితో అస్వస్థతకు గురయ్యారు. తల్లిదండ్రులు ఇద్దరు చిన్నారులను చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పిల్లలను పరీక్షించిన వైద్యులు ప్రాణపాయం లేదని స్పష్టం చేశారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అందజేత


బాధితుడికి ఫోన్ అందజేస్తున్న జగిత్యాల బస్‌స్టేషన్ మేనేజర్

జగిత్యాల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తూ మొబైల్ పోగుట్టుకున్న బాధితునికి ఆర్టీసీ అధికారులు తిరిగి అందజేశారు. కొడిమ్యాల మండలం పూడురుకు చెందిన ఆకుల వరప్రసాద్ కోరుట్ల పట్టణంలో విద్యుత్ శాఖలో సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.

అయితే విధులకు వెళ్లే క్రమంలో అదివారం ఆర్మూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కాడు. బస్టాండ్‌లో దిగి చూసుకోగా తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్ కనబడ లేదు. దాంతో వెంటనే బస్సులో తన మొబైల్ పడిపోయిందని ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు బస్సు డ్రైవర్‌కు సమాచారం అందించగా మొబైల్ ఫోన్‌ను బస్సులో నుంచి తీసుకొని అధికారులకు అప్పగించాడు. సోమవారం జగిత్యాల కొత్త బస్టాండ్‌లో బాధితుడు వరప్రసాద్‌కు స్టేషన్ మేనేజర్ బిఆర్‌రావు అప్పగించారు. ఈ సందర్భంగా బాధితుడు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపాడు.

భక్తజన సంద్రంగా వేములవాడ

● దర్శనం కోసం భక్తుల పాట్లు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ సోమవారం భక్త జనసంద్రమైంది. ఆలయానికి వివిధప్రాంతాల నుంచి దాదాపు 50వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎల్ఈడీ స్ర్కీన్‌లో రాజరాజేశ్వరస్వామిని, భీమేశ్వరాలయంలో భీమేశ్వరుడిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఇందుకు మూడుగంటల సమయం పట్టింది. భీమేశ్వరాలయం ఎదురుగా ఉన్న అన్నదానసత్రం పైఅంతస్తులో నిత్య కల్యాణం, సత్యనారాయణవ్రతాలు చేయించుకున్న భక్తులకు కష్టాలు తప్పలేదు. నిత్య కల్యాణానికి అనూహ్యంగా భక్తుల సంఖ్య పెరగడంతో 118 టికెట్లు జారీచేశారు. కేవలం దంపతులను మాత్రమే అనుమతించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి పర్యవేక్షిస్తూ తగిన ఏర్పాట్లు చేపట్టారు. అయినప్పటికీ భక్తుల ఇక్కట్లు చెప్పనలవి కాలేదు. కల్యాణ కట్ట వద్ద స్నానాలకు ఇబ్బందులు పడ్డారు.

వాహనదారులకు ఇబ్బందులు..

ఆలయానికి వచ్చే వాహనాలను భీమేశ్వరాలయం వైపు అనుమతించలేదు. దీంతోవాహనదారులు ఎటువెళ్లాలో తెలియక ఇబ్బందులు పడ్డారు. పార్కింగ్, అన్నదానసత్రం వద్ద నోఎంట్రీ బోర్డులు పెట్టారు. దీంతో భక్తులవాహనాలు భీమేశ్వరస్వామి ఆలయానికి చేరుకోవడానికి కిలో మీటర్ దూరంలో వాహనాలు నిలిపి కాలినడకన వెళ్లాల్సి వచ్చింది.

బద్దిపోచమ్మ ఆలయంలో..

బద్దిపోచమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. భీమేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భం గా పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో బద్దిపోచమ్మఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

అవినీతి జలగలు

- ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు కాని సిటిజన్ చార్ట్
- ఆరేళ్లలో 88 కేసుల్లో 131 మంది లంచగొండి ఉద్యోగులు, సహాయకుల అరెస్టు
- నేడు అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం



లంచగొండి ఉద్యోగుల సమాచారం అందించాలంటూ ఏసీబీ ఆవిష్కరించిన పోస్టర్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు జవాబుదారీగా విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి కూపంలో మునిగిపోతున్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయంకు వెళ్లినా ముడుపులు ముట్టజెప్పనిదే ఏ పని కావడం లేదు. విధి నిర్వహణలో భాగంగా ప్రజల సమస్యలు పరిష్కరిం చడం, పనులను సకాలంలో పూర్తి చేయడం ప్రభుత్వ ఉద్యోగుల విధి. కాని చేయాల్సిన పనులను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారు. లంచం ఇవ్వని వారి ఫైల్ బీరువాలోనే దుమ్ముపట్టి పోతున్నది. అక్కడి నుంచి ఆ ఫైల్ అంగుళం కూడా ముందుకు కదలడం లేదు.

● మధ్యవర్తులుగా సహాయకులు

కొన్ని కార్యాలయాల్లో ఆ ప్రభుత్వ కార్యాలయాకు అనుబంధంగా పనిచేస్తున్న ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు, వాహనాల డ్రైవర్లు, ప్రైవేట్ సహాయకులు మధ్యదళారులుగా వ్యవహరిస్తూ లంచాలను ప్రజల నుంచి వసూలు చేసి అధికారులకు అందజేస్తున్నారు. ఇలా కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు ప్రైవేట్ ఏజెంట్లు, డ్రైవర్లను ఏర్పాటు చేసుకుని లంచాలను వారి ద్వారానే స్వీకరిస్తూ ఏసీబీకి దొరకకుండా తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకపని పూర్తి చేయటానికి ప్రభుత్వం నిర్దిష్టమైన కాలాన్ని నిర్ణయించింది. దీనినే సిటిజన్ చార్ట్ అంటారు. ఏ కార్యాలయంలోనూ సిటిజన్ చార్ట్ బోర్డు కనపడదు. ఒకవేళ ఏమూలో కనపడకుండా ఏర్పాటు చేసినిన బోర్డులో ఆయా పనులు పూర్తి చేసే కాలపరిమితిని పేర్కొన్నప్పటికీ అది అములకు నోచుకోదు.

● టోల్ ఫ్రీ నంబర్ 1064, క్యూఆర్ కోడ్ స్కాన్‌తో ఫిర్యాదులు

అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సమాచారాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబర్ 1064కు కాల్ చేసి చెప్పవచ్చని, తప్పకుండా చర్యలుంటాయని ఏసీబీ పోలీసు అధికారులు అంటున్నారు. ఏసీబీ వాట్సప్ నంబరు 9440446106, కరీంనగర్ డీఎస్పీ నంబర్ 9154388954, క్యూఆర్ కోడ్‌కు స్కాన్ చేసి తెలంగాణ ఏసీబీ అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. సమాచారం అందించినవారు పేర్లను గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు.

● అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ నేపథ్యం...

చాలాదేశాల్లో అవినీతి పెరిగిపోయిన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి 2003 డిసెంబరు 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం నిర్వహించాలని తీర్మానించింది. ఈ మేరకు ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా డిసెంబరు 9న అవినీతి వ్యతిరేక దినోత్సవంపై సమావేశాలు, ర్యాలీలు, విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహిస్తున్నారు. కరీంనగర్‌లో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి 9వతేదీ వరకు అవినీతి వ్యతిరేక దినోత్సవంపై పలు కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు.

● కరీంనగర్ రీజియన్‌లో 2019 నుంచి ఇప్పటి 2025 వరకు లంచాలు తీసుకున్న సంఘటనల్లో ఏసీబీ పోలీసులు 88 కేసులు నమోదు చేసి 131 మంది లంచగొండి ఉద్యోగులు, మధ్యవర్తులను అరెస్టు చేశారు. ఇందులో 35 మంది రెవెన్యూ ఉద్యోగులు, 13మంది పోలీసు ఉండటం గమనార్హం. 2019లో 17 కేసుల్లో 25 మంది ప్రభుత్వ ఉద్యోగులను ఏసీబీ పోలీసులు అరెస్టుచేసి కటకటాల్లోకి పంపించారు. 2020లో ఏడు కేసుల్లో 11మంది, 2021లో 9 కేసుల్లో 15 మంది, 2022లో 13 కేసుల్లో 17 మంది, 2023లో ఎనిమిది కేసుల్లో 11 మంది, 2024లో 11 కేసుల్లో 17 మంది, 2025లో (డిసెంబరు 8 వరకు) 23 కేసుల్లో 35 మంది ప్రభుత్వ ఉద్యోగులు, మధ్య దళారులతో లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు.

నిజాయితీ చాటుకున్న అంబులెన్స్ పైలట్

● వాహనంలో మరిచిపోయిన రూ.10వేలు అప్పగింత



నగదును అప్పగిస్తున్న పంజాల సురేష్

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల కేంద్రానికి చెందిన 102 వాహనం పైలట్ పంజాల సురేష్ మరచిపోయిన రూ.10,000 బ్యాగ్ అప్పగించి సోమవారం నిజాయితీ చాటుకున్నాడు.. ధర్మపురి మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో బుగ్గారం గ్రామానికిచెందిన పొన్నం సుకన్య ఐదు రోజుల క్రితం డెలివరీ అయ్యింది. ధర్మపురి సీహెచ్ నుంచి బుగ్గారం గ్రామానికి చెందిన సుకన్యను 102వాహనంలో ఇంటికి తీసుకు వెళ్లాడు. ఆ సమయంలో పేషంట్‌తో పాటు సామాన్లు దించి పైలట్ సురేష్ ధర్మపురికి చేరుకున్నాడు. వాహనంలోని క్యాబిన్‌లో చూసే సరికి రూ.10వేల నగదు ఉన్న బ్యాగ్ కనిపించడంతో వెంటనే సుకన్య తండ్రి పొన్నం సత్తయ్యకు ఫోన్ చేశాడు. సత్తయ్య ధర్మపురి చేరుకోగా రూ.10వేల నగదుఉన్న బ్యాగ్‌ను ఆయనకు అప్పగించాడు. ఈసందర్భంగా పైలట్ సురేష్‌ను పలువురు అభినందించారు.

ఆర్టీసీ డిపో ఎదుట టిమ్స్ డ్రైవర్ల నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న టిమ్స్ డ్రైవర్లు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పని భారాన్ని పెంచడాన్ని నిరసిస్తూ సోమవారం గోదావరిఖని ఆర్టీసీ డిపో ఎదుట టిమ్స్ సర్వీస్ డ్రైవర్లు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా డ్రైవర్ రంగయ్య మాట్లాడుతూ తమకు ఎలాంటి సమాచారం లేకుండా సోమవారం నుంచి రెండు రోజుల పనివిధానాన్ని ఒక రోజుకు తగ్గించారని అన్నారు. హైదరాబాద్ ఉదయం వెళ్లే టిమ్ డ్రైవర్‌కు రెండు రోజుల వేతనాన్ని ఒకేరోజుకు తగ్గించారన్నారు. దీంతో కండక్టర్, డ్రైవర్ రెండు విధులు ఒకరే నిర్వహించాలంటే ఇబ్బందిగా మారుతుందన్నారు. ఈ సర్వీసులకు కండక్టర్‌ను కూడా ఇస్తే తాము విధులు నిర్వహించడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. తాము సంస్థకోసం పనిచేస్తామని, సంస్థను కాపాడుకోవడానికి కష్టపడుతామన్నారు. 20ఏళ్లుగా టిమ్స్ డ్రైవర్లుగా పనిచేస్తున్న తమకు స్పెషల్‌ఆఫ్ ఎత్తివేయడంతో తీవ్ర ఆర్థికనష్టం ఏర్పడుతుందన్నారు. రెండు విధులు ఒకరే నిర్వహించాలంటే ఆరోగ్యం సహకరించడం లేదన్నారు. అధికారులు కొత్తగా తీసుకువచ్చిన నిబంధనను రద్దుచేసి పాత పద్ధతిలోనే విధులు కేటాయించాలని డ్రైవర్లు డిమాండ్ చేశారు.

పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష వాయిదా వేయాలి



యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

గణేశ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీజీ మూడో సెమిస్టర్ పరీక్షను వాయిదా వేయాలని శాతవాహన యూనివర్సిటీ విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల జరుగుతుంటే వీసీ ఇదే సమయంలో పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు చాలామంది ఉన్నారని, ఓటు కోసం వెళ్లిరావాలంటే చాలాసమయం పడుతుందని అన్నారు. ఆలోచించకుండా పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. డిసెంబరులోనే సెట్, నెట్ ఎగ్జామ్స్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయని, యూనివర్సిటీలో చాలామంది విద్యార్థులు ప్రిపేర్ అవుతున్నారని అన్నారు. పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా యూనివర్సిటీలోని లైబ్రరీకి టైమింగ్స్ పెట్టి విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని, ప్రశ్నించిన విద్యార్థులను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. వీసీ చొరవ తీసుకొని విద్యార్థుల సమస్య లను పరిష్కరించాలన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం



మానేరువాగులో అయ్యప్పస్వామికి చక్రస్నానం చేయిస్తున్న గురుస్వామి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవాన్ని మాలధారులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన అయ్యప్పస్వామి శోభాయాత్ర కన్నుల పండువగా జరిగింది. అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభమైన శోభయాత్ర మంగళవాయిద్యాలతో అయ్యప్పదీక్షాపరుల నృత్యాలు, శరణుఘోషతో సిరిసిల్ల పట్టణం మారుమోగింది. అనంతరం మాండవ్యనదిలో గురుస్వామి రాచవిద్యాసాగర్ సారథ్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేకపూజలు, అర్చనలు, అభిషేకాలతోపాటు చక్రస్నానం నిర్వహించారు. అనంతరం సాయినగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో మెట్లపూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు భిక్ష అందించారు. కార్యక్రమంలో గురుస్వాములు దుబ్బ విశ్వనాథం, ఎరుకల ప్రకాష్, బల్కి రమేష్ పంతులు, మాజీ కౌన్సిలర్లు కల్లూరి రాజు, వెల్దండి దేవదాస్, అన్నల్‌దాస్ అనిల్‌కుమార్, కూన సురేష్, మచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గజ.. గజ..

● చలి నుంచి రక్షణకు ఒక్కచోట ఒదిగిన పిట్టలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న చలితీవ్రతతో చిన్నచిన్న పక్షులు తట్టుకోలేక పోతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం విద్యానగర్‌లో సోమవారం తెల్లవారుజామున కురుస్తున్న మంచుకు పక్షులు తడిసి ముద్దయ్యాయి. చలి దాటికి ఏడు చిన్న పసరిక పిట్ట(దీ గ్రీన్ బీ)లు సూర్యకాంతి కోసం వేచి చూస్తూ విద్యుత్ తీగపై దారంకు గుచ్చిన పూలమాదిరిగా ఒక్కచోట దగ్గరగా కూర్చుని వెచ్చదనం పొందుతున్నాయి. ఈ దృశ్యంను 'ఆంధ్రజ్యోతి' తన కెమరాలో బంధించింది.



విద్యుత్ తీగపై చలిలో పసరిక పిట్టలు

బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

వేములవాడ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన బద్దిపోచమ్మ ఆలయం రాజగోపురాల నిర్మాణాలకు సోమవారం దేవాదాయశాఖ స్థపతి వల్లి నాయగం, ఎస్ఈ దుర్గాప్రసాద్ మార్కింగ్ చేశారు. అనంతరం ఆలయ రాజగోపుర నిర్మాణాలకు సంబంధించిన మార్కింగ్, నిర్మాణ పద్ధతులు, విస్తీర్ణం, శిల్పకళా ప్రమాణాలను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఆలయ ఈవో రమాదేవి, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ జోన్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌లో సత్తాచాటి వెస్ట్ జోన్ పోటీలకు సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలు ఎంపికయ్యారు. ఈ నెల 6, 7 తేదిలలో రంగారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అస్మిత ఉమెన్స్ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు జరగాయి. వెస్ట్ జోన్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన ప్రవళిక, శ్వేదికలను సోమవారం తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ కోశాధికారి పన్నీర్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ నుండి ముగ్గురు బాలికలు కిక్ బాక్సింగ్ పోటీలలో పాల్గొన్నారు. జూనియర్ హార్డ్ స్టైల్‌వెపన్ ఈవెంట్ విభాగంలో గంగనావేణి ప్రవళిక గోల్డ్‌మెడల్, సబ్ జూనియర్స్ విభాగంలో గజ్జెల శ్వేదిక సిల్వర్ మెడల్ సాధించింది. గోల్డ్,సిల్వర్ మెడల్స్ సాధించిన ప్రవళిక, శ్వేదిక వెస్ట్‌జోన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వెస్ట్ జోన్‌స్థాయి పోటీలలో ఎనిమిది రాష్ట్రాలు పోటీలలో పాల్గొంటాయి. ఈనెల 25 నుంచి 28 వరకు మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరగనున్న వెస్ట్‌జోన్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో ప్రవళిక, శ్వేదికలు పాల్గొంటారు.



రాష్ట్ర స్థాయి పోటీలలో మెడల్స్ సాధించిన బాలికలు

అహల్యానగర్‌లో ఇళ్ల చుట్టూ మురుగు నీరు

హుజూరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అహల్యానగర్-1లో ఇళ్ల చుట్టూ మురుగునీరు నిలుస్తుండడం స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తోంది. కొన్నిరోజులుగా మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కాలనీలో చేపట్టిన మురికి కాలువ నిర్మాణం సగంలోనే వదిలేశారని, ఇళ్లలోని మురుగునీరు రోడ్లమీద నిలుస్తోందని వాపోతున్నారు. దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందించాలని, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



ఇళ్ల చుట్టూ ఉన్న మురుగునీరు

రూ.7300 పలికిన పత్తి ధర

జమ్మికుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7300పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 68మంది రైతులు 546 క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకొచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంద్వారా గరిష్ఠధర రూ.7300, కనిష్ఠధర రూ.6500 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. పత్తి కొనుగోళ్లను మార్కెట్ కమిటీచైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం పరిశీలించారు.



పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న

ఖని జనరల్ ఆసుపత్రిలో
పని చేయని నిఘా నేత్రాలు

- పెరుగుతున్న చోరీలు
- ఏడాదిగా నిరుపయోగంగా ఉన్నవైనం



ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం రోగులతో కిటకిటలాడే గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో ఏడాదిగా సీసీ కెమెరాలు పనిచేయక ఆసుపత్రికి వచ్చే రోగుల విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయి. ఆసుపత్రి పాత భవనం చుట్టూ, లోపల 13నిఘా నేత్రాలు ఉండగా అవి పని చేయడం లేదు. ఇటీవల ఆసుపత్రిలో రోగుల వస్తువులు, సెల్‌ఫోన్లు, మోటార్ సైకిళ్లు చోరీకి గురవుతున్నాయి. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు డబ్బులు పోగొట్టుకుని ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆసుపత్రికి వచ్చే బాధితుల్లో చాలా మంది నిరుపేదలు కావడం, వారు తెచ్చుకున్న వస్తువులు దొంగలు ఎత్తుకెళుతుండడంతో మనోవేదనకు గురవు తున్నారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆసుపత్రిలో 13 కెమెరాలు, మెడికల్ కళాశాలలో 12 కెమెరాలను ఏర్పాటు చేశారు. రెండేళ్ల పాటు పని చేసిన ఈ సీసీ కెమెరాలు ఏడాదిగా పనిచేయడం లేదు. సీసీ కెమెరాల కాంట్రాక్టర్ రెండు సంవత్సరాల అగ్రిమెంట్ పూర్తి కావడంతో వాటిని పట్టిం చుకోవడం లేదు. ఆసుపత్రిలో ఓపీవార్డుల వద్ద కెమెరాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఎక్కడికక్కడ కేబుల్ వైర్లు తెగిపోయాయి.

● ఆసుపత్రిలో విలువైన యంత్రాలు చోరీ...

రోగుల వస్తువులతోపాటు ఆసుపత్రిలోని విలువైన యంత్రాలు చోరీకి గురవుతున్నాయి. ఇటీవల వైద్యులు హాజరు నమోదు చేసుకునే ఫేస్ రికగ్నైజ్ యంత్రాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. దీనిపై ఇప్పటికీ వారిని కనిపెట్టలేకపోయారు. నిత్యం సెక్యూరిటీ కనుసైగల్లో ఉండే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విలువైన ఫేక్ రికగ్నైజ్ యంత్రాన్ని చోరీ చేయడం పలు అనుమానాలకు దారి తీస్తుండగా పోలీసులు విచారణ చేపట్టినా జాడ తెలియలేదు. చోరీకి గురైన యంత్రానికి సెక్యూరిటీ గార్డులను బాధ్యులను చేస్తూ వారి వేతనాల నుంచి కోత విధించారు. దీనిపై సెక్యూరిటీ గార్డులు కూడా నిరసన తెలిపారు.

● రోగుల వస్తువులు, బైక్‌ల చోరీ

ఆసుపత్రికి వచ్చే రోగుల విలువైన వస్తువులు, బైక్‌లను చోరీచేస్తున్నా వారిని పట్టుకోలేక పోతున్నారు. బెల్లంపల్లికి చెందిన ఓ వ్యక్తి భార్య ప్రసవం కోసం ఆసుపత్రికి రాగా అతడు వరండాలో నిద్రిస్తుండగా జేబులో నుంచి పర్సును ఎత్తుకెళ్లారు. గోదావరిఖనికి చెందిన ఓ వ్యక్తి డబ్బులు చోరీ చేశారు. ఇటీవల రెండు బైక్‌లు కూడా చోరీకి గురికాగా ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ, వైద్య సిబ్బంది పట్టుకున్నారు.

కలెక్టర్‌కు విన్నవించాం...

- రాజు, ఆర్ఎంవో



ఆసుపత్రిలో ఏడాదిగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. మెడికల్ కళాశాల నిర్మాణంలో భాగంగా ఆసుపత్రిలో 13, కళాశాలలో 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో 13కెమెరాలు పని చేయడం లేదు. చోరీలపై రోగులు తరచూ ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం. త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం.

ప్రజాపాలనకు రెండేళ్లు....

(5వ పేజీ తరువాయి)

కాగా, న్యూ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి 230 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 160 కోట్లతో రోడ్లు, మురికి కాలువల నిర్మాణా లు, గోదావరిఖని ఆసుపత్రి అభివృద్ధికి 173 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. పెద్దపల్లిలో 100 పడకల ఆసుపత్రి భవన నిర్మా ణానికి 51 కోట్లు, మంథనిలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి 25 కోట్లు, పెద్దపల్లి బైపాస్ రోడ్డు, పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మా ణాలు, మానేరుపై వంతెన నిర్మాణానికి 89 కోట్లు, పెద్దపల్లి బస్ డిపో నిర్మాణం మం జూరు, జిల్లా కేంద్రంలో జిల్లా కోర్టు భవన నిర్మాణ సముదాయం, జిల్లా గ్రంథాలయ నిర్మాణ పనులు, మహిళా భవనం పనులు ఆరంభం అయ్యాయి. టాస్క్ సెంటర్, పెద్దపల్లి, రామగుండంలో రెండు ఏటీసీల ఏర్పాటు, మంథనిలో రింగ్ రోడ్డు నిర్మాణం, తదితర అభివృద్ధి పనులు జరుగుతు న్నాయి. రామగుండలంలో బి థర్మల్ కేంద్రాన్ని 800 మెగావాట్లకు విస్తరిం చడానికి ఇటీవల రాష్ట్ర కేబినెట్ ఆమోదించడంతో తద్వారా ఈ ప్రాం తవాసులకు ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి




ట్రాక్టర్ నడుపుతూ శాత్రాజుపల్లికి వెళ్తున్న ఏసీపీ, కొలనూర్ పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ రామిరెడ్డి

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో జరగాలని పెద్దపల్లి డీసీపీ భూక్యా రామ్‌రెడ్డి అన్నారు. సోమ వార రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఏసీపీ గజ్జి కృష్ణ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్ల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికలు జరుగుతున్న వేళ ప్రత్యేక నిఘా ఉండాలని, ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీస్ వ్యవస్థ అలర్ట్‌గా ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వద్దన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు గ్రామాల్లో రాత్రి వేళల్లో ఖచ్చితంగా పెట్రోలింగ్ చేయాలని, డబ్బు, మద్యం పంపిణీ జరుగకుండా పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ ఎస్‌ఐ మల్లేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి) : కొలనూర్‌లో సోమవారం డీసీపీ రామిరెడ్డి పోలింగ్ స్టేషన్ ను పరిశీలించారు. ఓటర్లకు, సిబ్బందికి సౌకర్యాలను పరిశీలించారు. ఏసీపి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ రమేష్ ఉన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు జరుపుకోవాలని ఏసీపీ మడత రమేష్ సూచించారు. ముత్తారం మండల కేంద్రంలో ఎన్నికల కోడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అభ్యర్థులు ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేసిన ఎన్నిక నిబంధనల ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. అనంతరం పారుపల్లి పంచాయతీ పరిధిలోని మానేరు అవతల ఉన్న శాత్రాజుపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని ఏసీపీ సందర్శించారు. ట్రాక్టర్ స్వయంగా నడుపుతూ మానేరు నుంచి శాత్రాజుపల్లికి వెళ్లారు. అక్కడ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, ప్రజలకు సూచన చేశారు. ఎస్‌ఐ రవికుమార్ ఉన్నారు.

సోషల్ మీడియా గ్రూపులలో మెసేజ్ యాక్సెస్ అడ్మిన్లు మాత్రమే ఉంచుకోవాలని ఎస్‌ఐ ఎన్.రవికుమార్ సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కించపరుచుకునేలా మెసేజ్‌లు పంపేందుకు అవకాశాలుంటాయని, దీంతో ఆ గ్రూప్ అడ్మిన్ లేనిపోని చిక్కుల్లో పడతారని తెలిపారు. అలా జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా గ్రూప్ అడ్మిన్లే మెసేజ్‌లు పంపేలా యాక్సెస్ తీసుకోవడం ద్వారా ఇబ్బందులు ఉండవని సూచించారు. ఒకవేళ ఒకరిని కించపరిచేలా గ్రూపులలో మేసేజ్‌లు పంపితే గ్రూప్ అడ్మిన్లు బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అభ్యర్థులు, మద్దతుదారులు, ప్రజలు సహకరించాలి ఎస్‌ఐ శ్రీధర్ అన్నారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈసాలతక్కళ్ళపల్లి, పాలకుర్తి గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ రెండో విడత ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రశాం త వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుం టున్నామన్నారు. ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల సమ యంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. హెడ్ కానిస్టేబుల్ నరేందర్, ప్రజలు పాల్గొన్నారు. జీడీనగర్‌లో సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు.

సీపీఐ వందేళ్ల ఉత్సవాలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న తాండ్ర సదానందం

గోదావరిఖని, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని జనవరి 18న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. సోమవారం భాస్కరరావు భవన్‌లో రామగుండం నగర సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మావోయిస్ట్ పార్టీపై సాగిస్తున్న దమనకాండను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ఎన్నికల్లో రామగుండంలోని అన్ని డివిజన్లలో సీపీఐ పోటీ చేస్తుందని, డివిజన్లలోని ప్రజలను కలుపుకొని పోరాటాలు నిర్వహించాలన్నారు. 15 మంది నగర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. తాళ్ళపెల్లి మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కే కనకరాజ్, ఏఐటీయూసీ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరేల్లి పోషం, నాయకులు మడికొండ ఓదెమ్మ, మాటేటి శంకర్, తోడుపునూరి రమేష్ కుమార్, అసల రమ, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

స్వశక్తి మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్వశక్తి మహిళ లు అమృత్ మిత్రులుగా పని చేసి ఆర్థికంగా ఎదిగే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ అన్నారు. సోమవారం అమృత్ మిత్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మా ట్లాడుతూ పట్టణ నీటి సరఫరాలో స్వశక్తి మహిళలను భాగస్వాములను చేసి వారికి సాధికారత కల్పించడమే లక్ష్యంగా అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ అమృత్ 2.0 కింద చేపట్టిన పథకమన్నారు. స్వశక్తి మహిళల్లో ఆసక్తి ఉన్న వారిని గుర్తించి నీటి నాణ్యత పరీక్ష, ఉద్యానవనాల నిర్వహణ పనులను అప్పగించి పని గంటల ఆధారంగా వేతనం చెల్లిస్తామన్నారు. సుమారు రూ.1.2కోట్ల పనులను అమృత్ మిత్రుల ద్వారా నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతామని, అమృత్ మిత్రులు నెలవారీ ఆదాయం పొందేలా కార్యాచరణ రూపొందించాలని ఆమె ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఈఈ రామన్, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, సెక్రటరీ ఉమామహేశ్వర్‌రావు, డీఈ షాబాద్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, ఏఈ తేజస్విని, మెప్మా టీఎంసీ మౌనిక, సీఓలు, ఆర్‌పీలు, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలతో ఖని విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో గోదావరిఖనికి చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ శ్రీనివాస్‌ను జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ తగరపు శంకర్, కార్యదర్శి ఎం.రమేష్, స్పందన క్లబ్ కార్యదర్శి డాక్టర్ కె.నరేంద్రసోనీ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ గణేష్‌రాజ్, చిరంజీవి, ఆదిత్య, వంశీకృష్ణ, అభినందించారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మంథని జేకేఏ షోటోకాన్ కరాటే కోచ్ కోండ్ర నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు తమ ప్రతిభతో మెడల్స్ సాధించారు. 11 మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా 4 గోల్డ్, 3 సిల్వర్, 4 బ్రాంచ్ మెడల్స్ సాధించనట్లు కోచ్ కోండ్ర నాగరాజు తెలిపారు. వీరిని జేకేఏ షోటోకాన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, డీపీ కొమురోజు శ్రీనివాస్, మాస్టర్స్ బొడ్డెల ఇంద్రాణి, పొట్ల శ్రావణ్ కుమార్, దేవాన్స్‌లు అభినందించారు.

పరిశ్రమల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్ళు గడిచినా నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన, పరిశ్రమల ఏర్పాటులో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు విఫలమయ్యాడని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. మంథనిలో ఏర్పాటు చేసిన సెంటిలియోన్, టీవర్క్, డ్రీమ్ స్పార్ట్ రేజింగ్ ఆఫీసులను పుట్ట మధు సోమవారం సందర్శించి అందులో పని చేస్తున్న వారి వివరాలు తెలుసుకున్నారు. మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్ళలో మంథనికి రెండు సంస్థలు తీసుకువచ్చి అందులో కేవలం 22 మందికి మాత్రమే ఉద్యోగ అవకాశం కల్పించారన్నారు. మంత్రి తమ్ముడి పేరిట ఆరు కంపెనీలు కనిపిస్తున్నాయని, వాటిలో ఒక్క కంపెనీ ఇక్కడకు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. తనపై ఎన్ని కుట్రలు చేసిన నిరంతరం ప్రజల పక్షాణ ప్రశ్నిస్తానన్నారు. బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, పుప్పాల తిరుపతి, కుమార్, శ్రీను, కనుకయ్యలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనో హర్‌రెడ్డి అన్నారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా మండలంలోని వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, ఎదులాపురం, చిన్నరాత్, పెద్దరాత్‌పల్లి, మొట్లపల్లి గ్రామా ల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని గ్రామస్థులను కోరారు. మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రాంపల్లి పంచాయతీ ఏకగ్రీవం

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం రాం పల్లి సర్పంచ్‌గా కనపర్తి సంపత్‌రావు ఆదివారం ఏకగ్రీవం కాగా గ్రామం లోని 8 వార్డులు సైతం సోమవారం ఏకగ్రీవమయ్యాయి. మొదటి వార్డు జన గామ శ్రీనివాస్, 2వ వార్డు కనికిరెడ్డి స్వరూప, 3వవార్డు బొంకూరి దుర్గయ్య, 4వ వార్డు సుద్దాల విజయ, 5వ వార్డు బొంగాని రమేష్, 6వ వార్డు మడుపు జయలక్ష్మి, 7వ వార్డు కన్నం సంధ్య, 8వ వార్డు కనుకుంట్ల అంజయ్ లతో గ్రామపంచాయతీ పాలకవర్గ 8 స్థానాలు సోమవారం ఏకగ్రీవమయ్యాయి. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతం అధికారికంగా ప్రకటించనున్నారు.



ఉద్యోగి ఆరోగ్యంతోనే సంస్థ అభివృద్ధి



ప్రోత్సాహం అందుకుంటున్న సిబ్బంది

రామగిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగి ఆరోగ్యంతోనే సంస్థ అభివృద్ధి చెందుతుందని, అందుకు వైద్యబృందం చేస్తున్న సేవలు అమోఘమని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. సోమవారం సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని డిస్పెన్సరీలో 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా తనిఖీ నిర్వహించారు. డాక్టర్ రమేశ్‌బాబు బృందం సభ్యులు తనిఖీలు చేపట్టారు. డిస్పెన్సరీలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనరబరిచిన ఉద్యోగులకు జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కమిటీ సభ్యులు కార్పోరేట్ ఐటీ విభాగం డీజీఎం హరిశంకర్‌రావు, మెడికల్ సూపరింటెండెంట్ శేషగిరి రావు, ఏరియా సేఫ్టీ అధికారి శంకర్, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి అధికారులు పాల్గొన్నారు.

సెక్టార్-3 డిస్పెన్సరీని తనిఖీ చేసిన వైద్య బృందం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 డిస్పెన్సరీని కార్పొరేట్ వైద్య బృందం సోమవారం తనిఖీ చేసింది. ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య వైద్య సిబ్బందితో ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. జీఎం మాట్లాడుతూ ఉద్యోగులకు వైద్య సేవలు అందించడమే కాకుండా ఆరోగ్యంగా ఉండేలా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. తనిఖీ బృందం డిస్పెన్సరీలోని ఔట్ పేషంట్, క్యాజువాలిటీలను పరిశీలించారు. స్పైరో మెట్రీ, ఎక్స్‌రే, ఈసీజీ, లాబొరేటరీ విభాగాల్లో యంత్రాల పనితీరును బృంద సభ్యులు తనిఖీ చేశారు. ఉత్తమ సేవలు అందించిన డిస్పెన్సరీ సిబ్బందికి బహుమతులను అందజేశారు. తనిఖీ బృందంలో డీవై సీఎంఓ (అడ్మిన్) డా.రమేష్‌బాబు, డీవైజీఎం(ఐటీ) హరిశంకర్‌రావు, మెడికల్ సూపరెండెంట్ శేషగిరిరావు, ఏసీఎంఓ డా. అంబిక, ఎస్వోటూ జీఎం రాముడు ఉన్నారు.

ఆర్జీ-2లో దివ్యాంగులకు ఆటలపోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీ-2 యాజమాన్యం సోమవారం దివ్యాంగులకు ఆటలపోటీలను నిర్వహించింది. సీఈఆర్ క్లబ్‌లో పరుగుపందెం, మ్యూజికల్‌చైర్, హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఎస్వోటూ జీఎం రాముడు మాట్లాడారు. దివ్యాంగులను గౌరవించడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ రవీందర్, ఏజీఎం పర్సనల్, అధికార ప్రతినిధి అరవిందరావు, డీవైపీఎం వేణుగోపాల్, మనోచైతన్య నిర్వాహకులు కృష్ణకుమార్ పాల్గొన్నారు.

గనులపై వార్షిక రక్షణ పక్షోత్సవాలు



ఓసీపీ-1లో సేఫ్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పీవో



ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

గోదావరిఖని, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఓసీపీ-5లో ముఖ్య అతిథులుగా తనిఖీ కన్వీనర్ ఎస్టేట్ కార్పొరేట్ జనరల్ మేనేజర్ లక్ష్మిపతిగౌడ్, ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, రామగుండం రిజియన్ సేఫ్టీ జీఎం మధుసూదన్ హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగులచే రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు రక్షణలో ముందుకు సాగుతూ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తేనే సంస్థకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. రక్తంతో కూడిన బొగ్గు మనకు వద్దు-రక్షణతో కూడిన బొగ్గు మనకు ముఖ్యమని, ప్రతి ఒక్క ఉద్యోగి జీరో ఆక్సిడెంట్ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధికారులు బొల్లం శ్రీనివాస్, పీ విజయ ప్రసాద్, సోలార్, జీ లక్ష్మి రాజు, బీ తిరుపతి, కే. పద్మ, రమేష్, డీ రమేష్ బాబు, అనిల్ గబలే, శ్రీనివాస్‌రావు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ పోషం, పిట్ ఇంజనీర్, పి రమేష్, పిట్ సెక్రెటరీ ప్రభుదాస్ పాల్గొన్నారు.

జీడీకే1 ఇంక్లైన్‌లో జరిగిన రక్షణ పక్షోత్సవాలకు ముఖ్య అతిథులుగా తనిఖీ కన్వీనర్ జీఎం (హెచ్‌ఆర్‌డీ), ఆర్ విజయ ప్రసాద్, ఎస్‌ఓటూ జీఎం చంద్రశేఖర్, ఏఐటీయూసీ డిప్యూటి జనరల్ సెక్రటరి మడ్డి ఎల్లయ్య హాజరై రక్షణ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు సాయి ప్రసాద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్, గని ఏజంట్ ఎల్ రమేష్, బీ రవీందర్, ఎస్ శివ శంకర్, శైలెంద్ర కుమార్, మహేంద్రనాథ్, టీ పోషమల్లు, డాక్టర్ ఆదినారాయణ, సుధీర్ జక్కుల్ వార్, పిట్ సెక్రటరి మానాల శ్రీనివాస్, నాయకుల, ఉద్యోగులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో రక్షణ పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. వకీల్‌పల్లె గనిలో మేనేజర్ రవికిరణ సేఫ్టీ జండాను ఆవిష్కరించారు. సూపర్‌వైజర్లు, ఉద్యోగులు రక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండడంతో పెద్దగా ప్రమాదాలు చోటు చేసుకోలేదని మేనేజర్ తెలిపారు. ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ రాజు, సేఫ్టీ ఆఫీసర్ రాంకుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ నరేష్, డిప్యూటీ మేనేజర్ తిరుపతి పాల్గొన్నారు.

ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-1 ప్రాజెక్టులో రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా పీఓ ప్రవీణ్ ఫాటింగ్ మేనేజర్ పాపయ్యతో కలిసి రక్షణ పతాకాన్ని ఎగురవేశారు. ఈనెల 12న ప్రాజెక్టులో రక్షణ తనిఖీ బృందం తనిఖీ ఉంటుందని పీఓ తెలిపారు. అధికారులు ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు రమేష్, శేఖర్, కార్మిక సంఘాల నాయకులు గడ్డం తిరుపతి, మల్లేష్ యాదవ్, శేఖర్‌తో పాటు రక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కన్వెయన్స్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న బుర్ర తిరుపతి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న కన్వెయన్స్ డ్రైవర్ల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు బుర్ర తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్దె వాహనాల డ్రైవర్లకు స్కిల్డ్ వేతనాలు నెలకు రూ.22,800 చెల్లించాల్సి ఉండగా రూ.12,000 మాత్రమే చెల్లిస్తున్నట్టు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అడాప్ట్ పేమెంట్ పేరిట డ్రైవర్ల వేతనాల్లో రూ. 15,000 చొప్పున కోత విధించారని, ఇప్పటి వరకు వాటిని డ్రైవర్లకు ఇవ్వలేదని తెలిపారు. ఈఎస్‌ఐ వర్తింపజేయడం లేదని, సింగరేణి ఆసుపత్రుల్లో ఔట్ పేషంట్‌గా మాత్రమే కన్వెయన్స్ డ్రైవర్లను పరిగణిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి కార్మికుడికి సీఎంపీఎఫ్, ఈఎస్‌ఐ వర్తించేలా చర్యలు తీసుకోవాలని, సింగరేణి ఆసుపత్రుల్లో ఇన్ పేషంట్‌గా కన్వెయన్స్ డ్రైవర్లకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజారత్నం, సురేష్, శంకర్, సదానందం, రాజేష్, శ్రీనివాస్, లక్ష్మణ్, మొహినుద్దీన్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు



నియామక పత్రాలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం, టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 8మంది విద్యార్థులు హైదరబాద్‌కు చెందిన ఏజె సొల్యూషన్స్, హెచ్-1 హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. లక్ష్మీ నర్సయ్య తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషమన్నారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలో షీటీంపై అవగాహన



మాట్లాడుతున్న షీటీం ఇన్‌చార్జి ఎస్‌ఐ లావణ్య

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు షీటీం అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీం ఇంచార్జీ ఎస్‌ఐ లావణ్య మాట్లాడుతూ మహిళల భద్రతపై షీటీం ఏ విధంగా పనిచేస్తుందో తెలిపారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మహిళలు, విద్యార్థులు వేధింపులకు గురైతే 6303923700 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఎవరైనా మోసాలకు గురైతే 1930 నెంబర్‌కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. షీటీమ్ సభ్యులు మౌనిక, సురేష్, స్నేహలత, హెడ్‌మాస్టర్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

పెద్దపల్లి ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవం

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ జర్నలిస్టు బుర్ర సంపత్ కుమార్ గౌడ్ ప్రధాన ఎన్నికల అధికారిగా వ్యవహరించగా ప్రెస్‌క్లబ్ పూర్వ అధ్యక్షుడు చంద్రమొగిలి, ముఖ్యఅతిథి రవీందర్ సమక్షంలో కార్యవర్గాన్ని నియమించారు. అధ్యక్షుడిగా నారాయణదాస్ అశోక్, ప్రధాన కార్యదర్శి పోగుల విజయ్‌కుమార్, కోశాధికారి వీరమల్ల విద్యాసాగర్‌రావు, ఉపాధ్యక్షులుగా ఆకుల రమేష్, కొండ లింగమూర్తి యాదవ్, ఈదునూరి జయపాల్, సహాయ కార్యదర్శులుగా నాగులమల్యాల శివ కోటయ్యచారి, కొమిరిశెట్టి శ్రీనివాస్, మోదుంపల్లి సాగర్, కార్యవర్గ సభ్యులుగా అడిచెర్ల రమేష్, ముత్యాల కృష్ణమూర్తి, కొలిపాక కృష్ణ, తిరుమల సురేష్, సయ్యద్ నసీర్, సుంక మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

మానవహక్కుల సంస్థ జనరల్ సెక్రెటరీగా సురేష్



నియామక పత్రం అందుకుంటున్న సురేష్

ఓదెల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా జనరల్ సెక్రెటరీగా ఓదెలకు చెందిన తూడి సురేష్‌ను నియమించారు. సోమవారం గుంటూరులో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న సురేష్‌ను జనరల్ సెక్రెటరీగా నియమిస్తూ సంస్థ చైర్మన్ వెంకటేశ్వర్లు నియామక పత్రాలను అందజేశారు. సురేష్ నియామకంపై గ్రామస్తులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, బోర్డు డైరెక్టర్ సహేద తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులను పాఠశాలలో చేర్పించిన ఎంఈవో

ఓదెల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కనగర్తిలో చదువు మానేసిన బాలికలను సోమవారం ఎంఈఓ రమేష్, ఉపాధ్యాయులు బడిలో చేర్పించారు. కొన్ని రోజుల నుంచి చదువు మానేసి బడికి రాకుండా ఉంటున్న కొలిపాక రక్షిత, కొలిపాక రమ్య, విష్ణువర్ధన్ ఇండ్లలోకి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్య ప్రాధాన్యతను వివరించి అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు ఒప్పుకోని బడికి పంపిస్తున్నారని ఎంఈఓ తెలిపారు.

లక్ష్మణ్ ఎన్నికపై హర్షం

ఎలిగేడు, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఎలిగేడుకు చెందిన గ్యాజంగి లక్ష్మణ్ పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయనను పద్మశాలి సంఘం నాయకులు సన్మానించారు. మండల అధ్యక్షుడు మామిడాల రమేష్, గ్రామ అధ్యక్షుడు కోడూరి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు ఐట్ల శ్రీనివాస్, బూర్ల సత్యనారాయణ, కోడూరి సత్యం, బూర్ల వెంకట సత్యం, తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం వికాసానికి అడ్డంకి కాదు



దివ్యాంగ విద్యార్థికి బహుమతి ఇస్తున్న ఎంఈవో

ఎలిగేడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైకల్యం వికాసానికి అవరోధం కాదని మండల విద్యాధికారి అనసూరి నరేంద్రచారి అన్నారు. సోమవారం ధూళికట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం, భవిత కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం మానసిక వికాసానికి అవరోధం కాదన్నారు. ప్రతి దివ్యాంగుడు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని, ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం గండ్ర దేవేందర్ రావు, ధూళికట్ట హెచ్‌ఎం సాధన, యుగేందర్, వెంకటరెడ్డి, ఐఆర్‌పీ సంతోష్ కుమార్, రమేష్, సీఆర్‌పీ లక్ష్మినారాయణ, నిర్వాహకులు భవిత, విద్యార్థులు పాల్గొన్నారు.